# స్థానిక ఎన్నికలపై బీసీల దృష్టి

- జనాభా దామాషా ప్రకారం పెరగనున్న కోటా
- గతంలో 22 శాతం రిజర్వేషన్..
- ఈసారి 42 శాతం పెంపునకు ప్రభుత్వం ఆర్డినెన్స్
- గత ఎన్నికల్లో జనరల్ స్థానాల్లో బీసీల పాగా
- పంచాయతీ, పరిషత్ ఎన్నికల్లో వారిదే పై చేయి

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణనలో బీసీలు 56 శాతం ఉన్నట్లు స్పష్టమైన నేపథ్యంలో, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు ప్రాధాన్యత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. గతంలో 22 శాతం మాత్రమే రిజర్వేషన్ ఉన్నా, బీసీలు జనరల్ కోటాలో కూడా పెద్ద సంఖ్యలో విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం ఆర్డినెన్స్ సిద్ధం చేస్తోంది.

**2019లో జనరల్ స్థానాల్లో బీసీల సత్తా**

గత స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు తమ ప్రభావాన్ని స్పష్టంగా చూపించారు. 2019 పంచాయతీ ఎన్నికల్లో జిల్లాలో మొత్తం 311 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగ్గా, బీసీలకు కేటాయించిన 49 స్థానాలపాటు, 83 జనరల్ స్థానాల్లో కూడా విజయం సాధించారు. మొత్తం 132 పంచాయతీలను బీసీలు గెలుచుకున్నారు. ఎంపీటీసీ స్థాయిలో 130 స్థానాల్లో 13 బీసీ రిజర్వేషన్లు ఉండగా, 38 జనరల్ స్థానాల్లోనూ గెలిచి మొత్తం 51 సీట్లు కైవసం చేసుకున్నారు. జడ్పీటీసీ స్థాయిలో రెండు రిజర్వు స్థానాలతో పాటు నాలుగు జనరల్ స్థానాల్లో




విజయం సాధించి, మొత్తం ఆరుగురు బీసీలు జడ్పీటీసీగా ఎంపికయ్యారు.

**ఈసారి రెట్టింపు రిజర్వేషన్**

గతంలో కేవలం 22 శాతమే రిజర్వేషన్ ఉన్నా బీసీలు మంచి ప్రాతినిధ్యం సాధించారు. ఇప్పుడు దాదాపు రెట్టింపు స్థాయిలో, అంటే 42 శాతం రిజర్వేషన్లను ప్రభుత్వం ఆర్డినెన్స్ ద్వారా అమలు చేయాలని నిర్ణయించింది. బీసీ సంఘాల డిమాండ్, ప్రభుత్వ హామీ నేపథ్యంలో ఈ చర్య తీసుకోవడం విశేషం.

**ప్రణాళికలతో ముందడుగు**

ఈసారి జిల్లాలో 306 గ్రామ పంచాయతీలు ఉండగా, బీసీలు జనరల్ కోటాలో కూడా ఎక్కువ సీట్లను గెలుచుకునేందుకు ముందస్తు ప్రయత్నాలు ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ చట్టం–2018కి సవరణలు చేసి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో రిజర్వేషన్ల అమలుకు ప్రణాళికలు రూపొందిస్తోంది.

**ఆగస్టులో ఎన్నికల ప్రక్రియ**

ఆర్డినెన్స్ విడుదలైన వెంటనే పంచాయతీరాజ్‌శాఖ రిజర్వేషన్ల ఖరారుకు సిద్ధమవుతుంది. ఆ తర్వాత రాష్ట్ర ఎన్నికల సంఘం ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ, జిల్లా పరిషత్ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేస్తుంది. గరిష్టంగా 30 రోజుల్లో ఎన్నికలు పూర్తిచేయాలన్న లక్ష్యంతో ఏర్పాట్లు చేస్తున్నారు. టికెట్ల కోసం ఆశావహులు ఇప్పటికే రంగంలోకి దిగారు.



# రైతులకు కేంద్రం భరోసా

## పీఎం ధన్ ధాన్య యోజనకు కేబినెట్ ఆమోదం

**శెనార్తి మీడియా, న్యూఢిల్లీ:**

రైతాంగానికి ఊతమిచ్చే విధంగా కేంద్ర ప్రభుత్వం పీఎం ధన్ ధాన్య యోజన అనే కొత్త పథకానికి ఆమోదం తెలిపింది. ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. దేశవ్యాప్తంగా 100 వ్యవసాయ జిల్లాలలో ఈ పథకం అమలుకానుండగా, దాదాపు 1.70 కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూరనుంది.

**ఆరేళ్లకు రూ. 1.44 లక్షల కోట్లు**

వార్షికంగా రూ. 24 వేల కోట్ల వ్యయంతో, 2025–26 నుంచీ ఆరేళ్లపాటు ఈ పథకాన్ని అమలు చేయనున్నట్టు కేంద్రం ప్రకటించింది. వ్యవసాయం, దానికి అనుబంధ రంగాల అభివృద్ధి ప్రధాన లక్ష్యంగా ఈ పథకాన్ని రూపొందించినట్టు తెలిపింది. ఉత్పాదకత తక్కువగా ఉన్న జిల్లాలు, అన్ని రుతువుల్లో సాగు జరగని ప్రాంతాలు, రుణ లభ్యత తక్కువగా ఉన్న జిల్లాల ఆధారంగా 100 జిల్లాలను ఎంపిక చేయనున్నారు.

**పంట వైవిధ్యం, నిల్వల బలోపేతం**

ఈ పథకం ద్వారా పంట వైవిధ్యతను ప్రోత్సహించడం, కోత అనంతర నిల్వలు మెరుగుపరచడం, నీటి మౌలిక వసతుల అభివృద్ధి, స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాల లభ్యత పెంపు వంటి అంశాలపై దృష్టి పెట్టనున్నారు. ప్రతి రాష్ట్రంలో కనీసం ఒక జిల్లాను ఈ పథకం కింద అభివృద్ధి చేయనున్నట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు.

**కమిటీల ఏర్పాటు, పర్యవేక్షణ**

పథకం అమలును పర్యవేక్షించేందుకు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలలో కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. ప్రతి జిల్లాలో పథకం పురోగతిని 117 పనితీరు సూచికల ద్వారా క్రమం తప్పకుండా పర్యవేక్షించనున్నారు. దీని ద్వారా రైతులకు ప్రత్యక్షంగా లబ్ధి చేకూరనుందని ఆయన పేర్కొన్నారు.

**గ్రీన్ ఎనర్జీకి ప్రోత్సాహం**

ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ రంగంలో రూ. 20 వేల కోట్ల పెట్టుబడులకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. పునరుత్పాదక విద్యుత్ రంగాన్ని బలోపేతం చేయడంలో ఇది కీలక ముందడుగు కానుంది.

**వ్యోమగామికి అభినందనలు**

అంతరిక్ష యాత్ర పూర్తి చేసి భూమికి తిరిగొచ్చిన వ్యోమగామి శుభాంశు శుక్లాకు కేంద్ర మంత్రిమండలి అభినందనలు తెలిపింది. 18 రోజుల అంతరిక్ష ప్రయాణం తర్వాత విజయవంతంగా భూమిని చేరిన శుక్లాను ప్రత్యేకంగా ప్రశంసించింది.

# అమ్మవారి కుంట ఆక్రమణ.?



**శెనార్తి మీడియా, శంకరపట్నం :**

ధర్మారం శివారులోని అమ్మవారి కుంట భూమిని కొంతమంది ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని రైతులు ఆరోపించారు. సర్వే నంబర్ 106లో 2. 26 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ కుంటను చింతిరెడ్డి, కొండల్ రెడ్డి అనే రైతులు కబ్జాకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.పశువుల బతికించుకోవడానికి, వ్యవసాయ అవసరాలకు ఉపయోగపడే ఈ కుంట భూమి ఆక్రమించబడితే భవిష్యత్తులో తీవ్ర సమస్యలు తలెత్తతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములను అక్రమంగా కబ్జా చేస్తున్నాఅధికారులు కన్నెత్తి చూడడంలేదని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు మండిపడ్డారు.అమ్మవారి కుంట భూమిని వెంటనే కబ్జాదారుల నుంచి విడిపించేందుకు చర్యలు తీసుకోవాలని, సమస్యను పరిశీలించి న్యాయం చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులను కోరారు.

# రాజస్థాన్‌లో అమానుషం

## మహిళపై ఏడుగురు వ్యక్తుల సామూహిక అత్యాచారం

**శెనార్తి మీడియా, జైపూర్:** రాజస్థాన్‌లోని అల్వార్‌లో ఓ మహిళపై దారుణమైన ఘటన జరిగింది. ఏప్రిల్ 24న రాత్రి ఇంటి నుంచి బయటకు వచ్చిన ఆ మహిళను బొలెరో వాహనంలో వచ్చిన ముగ్గురు వ్యక్తులు కిడ్నాప్ చేశారు.ఆపై ఓ రహస్య ప్రదేశానికి తీసుకెళ్లి, అక్కడ ఉన్న మరో నలుగురు వ్యక్తులతో కలిసి ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితురాలిని 11 రోజుల పాటు బంధించి పదేపదే లైంగిక దాడులు చేశారు. అనంతరం అపస్మారక స్థితిలో రోడ్డుపక్కన వదిలి పారిపోయారు.బయటకు చెప్పితే దాడి సమయంలో తీసిన వీడియోను సామాజిక మాధ్యమాల్లో పెట్టేస్తామని బెదిరించినట్లు ఆమె తెలిపింది. ఇంటికి చేరిన తర్వాత కుటుంబ సభ్యులకు విషయం చెప్పిన బాధితురాలు, నిందితుల బెదిరింపులకు భయపడి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. కొన్ని రోజుల తర్వాత ధైర్యంగా పోలీసులను ఆశ్రయించినా, వారు స్పందించకపోవడంతో కోర్టును ఆశ్రయించింది.కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, విచారణను డీఎస్పీ స్థాయి అధికారికి అప్పగించారు.

## పాక్ డ్రోన్లు భారత్‌కు ఎలాంటి

# నష్టాన్ని కలిగించలేదు

## చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్

**శెనార్తి మీడియా, న్యూఢిల్లీ:**

ఆపరేషన్ సింధూర్ సమయంలో పాకిస్థాన్ డ్రోన్లను ఉపయోగించిందని, అవి భారత డిఫెన్స్ వ్యవస్థకు ఎలాంటి నష్టాన్ని కలిగించలేదని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ అన్నారు. పాక్ ఉపయోగించిన ఆ డ్రోన్లను చాలావరకు స్వదేశీ టెక్నాలజీతో నిర్మూలించామని పేర్కొన్నారు. ప్రస్తుతం డ్రోన్లు ఒక మిలిటరీ సాధనంగా మారాయని వివరించారు. నిన్నటి ఆయుధ వ్యవస్థలతో నేటి యుద్ధాన్ని గెలవలేమని అన్నారు. నేటి యుద్ధాన్ని రేపటి సాంకేతికతోనే పోరాడాలని చెప్పారు. దిల్లీలో జరిగిన యూఏవీ అండ్ యూఏఎస్ స్వదేశీకరణపై జరిగిన వర్క్‌షాప్‌లో ఆయన ఈ మేరకు కామెంట్స్ చేశారు. 'ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్ డ్రోన్లు, మందుగుండు సామగ్రిని ఉపయోగించింది. వాటిలో ఏదీ కూడా భారత్ సైనిక లేదా పౌర మౌలిక సదుపాయాలపై ఎటువంటి నష్టం కలిగించలేదు. చాలా వరకు కైనెటిక్, నాన్ కైనటిక్ పద్ధతుల్లో ఆ డ్రోన్లను కూల్చివేశాం. కొన్ని డ్రోన్లను రికవరీ చేశాం. ఇక డ్రోన్ల గురించి మనం మాట్లాడుతున్నప్పుడు యుద్ధంలో పరిణామాత్మక మార్పును తీసుకువస్తున్నాయా? లేదా? అని ఆలోచించాల్సి వస్తుంది. డ్రోన్ల వ్యవస్థలో జరుగుతున్న అభివృద్ధి ఓ పరిణామాత్మక ప్రక్రియ కాగా, వాటి వినియోగం మాత్రం యుద్ధ రంగంలో విప్లవాత్మక మార్పును తీసుకొచ్చింది. డ్రోన్ల వినియోగ సామర్థ్యం పెరిగినా కొద్దీ, భారత్ సైన్యం వాటిని విప్లవాత్మకంగా ఉపయోగించడం ప్రారంభించాయి. ఇటీవల కాలంలో జరుగుతున్న యుద్ధాల్లో డ్రోన్ల పనితీరును ప్రత్యక్షంగా చూస్తున్నాం' అని చౌహాన్ అన్నారు.

**విదేశీ సాంకేతికపై ఆధారపడటం ప్రమాదకరం**

'దేశీయంగా అభివృద్ధి చేసిన కౌంటర్–యూఏఎస్ వ్యస్థలు ఎందుకు కీలకమో ఆపేరషన్ సిందూర్ మనకు స్పష్టం చేసింది. మనల్ని మనం రక్షించుకోవడానికి స్వదేశీ సామర్థ్యాల్లో పెట్టుబడి పెట్టాల్సిన అవసరం ఉంది. అలాగే వాటిని నిర్మించుకోవాలి. రక్షణ, దాడి లక్ష్యాల కోసం కీలకంగా మారిన ఈ వ్యవస్థల విషయంలో మనం పూర్తిగా విదేశీ సాంకేతికతపై ఆధారపడలేం. ఆపరేషన్ సిందూర్ సమయంలో విదేశీ సాంకేతికతపై ఆధారపడి వల్ల ఎలాంటి సమస్యలు ఎదురవుతాయో స్పష్టంగా తెలిసింది. వాటిపై ఆధారపడితే అది మన సన్నద్ధతను బలహీనపరుస్తుంది. ఉత్పత్తిని పెంచే సామర్థ్యాన్ని పరిమితం చేస్తుంది. అలాగే అవసరమైనప్పుడు విడిభాగాల కొరతకు దారితీస్తుంది. అంతేకాకుండా, విదేశీ సామర్థ్యం గురించి అందరికీ తెలుసు. దీంతో ప్రత్యర్థులు ఈ వ్యవస్థల సామర్థ్యం ఆధారంగా మన వ్యూహాలను అంచనా వేయగలరు' అని సీడీఎస్ చౌహాన్ అన్నారు



# ముఖం చాటేసిన వర్షాలు

- నైరుతి కానరాక రైతుల్లో ఆందోళన
- వేసిన పంటలు దక్కుతాయో లేదాననే భయం

**శెనార్తి మీడియా, జూలై16 :**



అనేక జిల్లాల్లో వర్షాలు రైతులను ఊరించి ఉసూరుమనిపించాయి. వానాకాలం సీజన్ ప్రారంభమై 45 రోజులు దాటుతున్నా, సరైన వానలు కురవకపోవడంతో వేసిన విత్తనాలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోంది. మే నెల రెండో వారంలో కురిసిన వర్షాలతో అన్నదాతలు సంతోషపడ్డారు. కొందరు పత్తి విత్తనాలు నాటుకోగా, మరికొందరు వరి నారుమడులు దున్నుకున్నారు. ఇంకొందరు నేరుగా వడ్లు చల్లుకున్నారు. ఆ తర్వాత అడపాదడపా వర్షాలు తప్ప వానలు జోరందుకోవడం లేదు. దీంతో ఈ సీజన్‌లో ఇప్పటి వరకు లోటు వర్షపాతమే నమోదైంది. వెదజల్లుడు పద్ధతిలో వేసిన వరి పొలాలతో పాటు, నారుమడులు, పత్తి మొక్కలు ఎండే పరిస్థితి వచ్చింది. వాటిని కాపాడుకునేందుకు అన్నదాతలు కష్టాలు పడుతున్నారు. బావి, బోర్లున్న రైతులు నీటి తడులు కట్టుకుంటుండగా, పూర్తిగా వర్షాధారంపైనే పంటలు వేసిన రైతులు మాత్రం చినుకు పడకపోతుందా అని ఆశగా ఆకాశం వైపు ఎదురుచూస్తున్నారు. అనేక మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. సాధారణం కంటే తక్కువగా వర్షాలుపడ్డాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొంత భిన్నమైన పరిస్థితి ఉంది. 23 మండలాలకు గాను 11 మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. నాలుగు మండలాల్లో సాధారణం కంటే ఎక్కువగా వర్షాలు పడగా, మిగిలిన 8 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. పినపాకలో 46.8 శాతం, కరకగూడెంలో 46.5 శాతం, దుమ్ముగూడెంలో 42.7, మణుగూరులో 34.7 శాతం లోటు– వర్షపాతం నమోదైంది. జిల్లాలో వర్షాభావ పరిస్థితుల కారణంగా నారుమడులు ఎండిపోతున్న విషయాన్ని బాధిత రైతులు మంత్రుల దృష్టికి తీసుకువచ్చారు. దీంతో నాలుగు రోజుల కింద సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి నీటిని విడుదల చేశారు. రెండ్రోజుల కింద పాలేరు రిజర్వాయర్ నుంచి సాగర్ నీటిని విడుదల చేశారు. నాలుగైదు రోజుల్లో ఆయకట్టు–మండలాల పరిధిలో ఈ ప్రాజెక్టుల ద్వారా విడుదల చేసిన నీరు పంటలకు ఉపయోగపడే అవకాశం ఉంది. ఆయకట్టు లేని మండలాల్లో మాత్రం పూర్తిగా వర్షాలపైనే ఆధారపడి ఉండడంతో వానలు ముమ్మరంగా కురిస్తే తప్ప పంటలను దక్కించుకునే పరిస్థితి లేదు. సరైన వర్షాలు లేక మొలిచిన పత్తి మొక్కలు వాడిపోతున్నాయి.. మొదట వేసిన విత్తనాలు మొలవకపోవడంతో రెండోసారి వేయాల్సి వచ్చింది. వాన వస్తేనే పెట్టిన పెట్టుబడులైనా వస్తాయని ఆశ పడుతున్నారు. జులై నెల సగం గడిచినా ఆశించిన మేర వర్షాలు పడకపోవడంతో నారు ముదిరిపోతోంది. మరో వారం రోజుల్లో వర్షాలు పడకపోతే నారు పనికి రాకుండా పోతుంది. లక్షలాది మంది రైతుల పరిస్థితి ఇదే విధంగా ఉంది. వానాకాలం ప్రారంభమై నెలన్నర గడిచినా కనీస వర్షపాతం నమోదు కాకపోవడంతో అన్నదాతల్లో ఆందోళన మొదలైంది. లోటు వర్షపాతం నమోదు కావడం కలవరపెడుతోంది. ప్రస్తుత సీజన్‌లో లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తారని వ్యవసాయ అధికారులు అంచనా వేయగా జులై రెండో వారం గడిచినా 20 శాతం పంటలు కూడా సాగులోకి రాలేదు. ఉమ్మడి మెదక్ జిల్లాలో వరి 3.6 లక్షల ఎకరాల్లో సాగు జరుగుతుందని అంచనా వేస్తే ప్రస్తుతం 30 వేల ఎకరాలలోపే సాగవుతుంది. 1.20 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేస్తారని అంచనా వేయగా 60 వేల ఎకరాల్లో మాత్రమే గింజలు విత్తారు. మొక్కజొన్న 30 వేల ఎకరాల్లో అంచనా వేయగా 15 వేలు, కందులు 10 వేల ఎకరాల అంచనాల్లో 3 వేల ఎకరాల్లో మాత్రమే సాగు చేస్తున్నారు. జిల్లాలో జులై రెండో వారం నాటికి 183.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు 155.9 మిల్లీ మీటర్ల వర్షం మాత్రమే కురిసింది. సాధారణ వర్షపాతంలో 27.3 లోటు వర్షపాతం నమోదైంది.

# హైదరాబాద్‌లో పగటి వేళల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

**శెనార్తి మీడియా, హైదరాబాద్:**

డే టైమ్‌లో మద్యం సేవించి వాహనాలు నడిపే ఘటనలు పెరగడంతో హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు పగటి పూట కూడా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ప్రారం భించారు. జాయింట్ సీపీ జోయల్ డేవిస్ తెలిపారు. జూన్‌లో 35 మంది స్కూల్ బస్ డ్రైవర్లు మద్యం సేవించి పట్టుబడ్డారు. దీంతో ఉదయాన్నే తనిఖీలు నిర్వహించేం దుకు నిర్ణయం తీసుకున్నారు. ట్రాఫిక్ జామ్ లేకుండా రహదారి పరిస్థితులను బట్టి ఆకస్మిక తనిఖీలు జరుగుతాయని తెలిపారు.

మరి ముఖ్యంగా మైనర్ డ్రైవింగ్‌పై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు 4500 కేసులు నమోదు చేసి, 2800 వాహనాల రిజిస్ట్రేషన్ రద్దు కోసం సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ 25 ఏళ్ల వయసు వరకు ఇవ్వకుండా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనం నడపడం వల్లే అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయని, ఈ చర్యలతో కేసులు తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నామని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

